
సాక్షి ఖమ్మం

బుధవారం। 13। ఆగస్టు। 2025



అక్వాడెక్ట్‌కు అడ్డుగా గుట్టలు

సీతారామ అక్వాడెక్ట్‌కు అడ్డుగా బండలు, గుట్టలు ఉండడంతో వరద సాఫీగా సాగక రాకాసితండాకు ముంపు పొంచి ఉంది. 8లో



ఆయుష్షు పోస్తూ..

కుటుంబీకుల ఆయువు పోయినా కొందరికి ఆయుష్షు పోసేలా అవయవ దానానికి జిల్లావాసులు ముందుకొస్తున్నారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 30° / 23°

జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

నేడు, రేపు మంత్రి తుమ్మల పర్యటన

ఖమ్మంఅర్బన్: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధ, గురువారాల్లో ఖమ్మంతో పాటు రఘునాథపాలెం మండలంలో పర్యటించనున్నారు. బుధవారం సాయంత్రం 4గంటలకు రఘునాథపాలెం మండలం దోనబండలో బీటీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అలాగే, గురువారం ఉదయం ఖమ్మం 54వ డివిజన్ వీడీఓ కాలనీలోని రెడ్‌క్రాస్ సొసైటీ భవనంలో మల్టీ సర్వీస్ డే కేర్ సెంటర్‌ను ప్రారంభించనున్న మంత్రి, ఆ తర్వాత 36వ డివిజన్‌లో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు.

28 నుంచి అండర్‌-15 బ్యాడ్మింటన్ టోర్నీ



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి అండర్‌–15 బాల బాలికల బ్యాడ్మింటన్ టోర్నీని ఖమ్మంలో నిర్వహిస్తున్నట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కర్నాటి వీరభద్రరావు, వి.చంద్రశేఖర్ తెలిపారు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలోని ఇండోర్ స్టేడియంలో ఈనెల 28నుంచి 31వ తేదీ వరకు టోర్నీ జరుగుతుందని వారు వెల్లడించారు. ఈమేరకు అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కమర్తపు మురళి, కోశాధికారి జట్ల శ్రీనివాసరావుతో కలిసి మంగళవారం వారు టోర్నీ బ్రోచర్లు ఆవిష్కరించి మాట్లాడారు. నాలుగు రోజుల పాటు జరిగే పోటీలకు రాష్ట్రంలోని 20 జిల్లాల నుంచి 200 మందికి పైగా క్రీడాకారులు హాజరుకానున్నారని తెలిపారు. ఎంట్రీల కోసం క్రీడాకారులు ఈనెల 24వ తేదీలోగా www.btronline.in లో సంప్రదించాలని సూచించారు. ప్రతీ జిల్లా జట్టులో ఐదుగురు ఆడనుండగా, సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ అంశాల్లో పోటీలు జరుగుతాయని.. ఇక్కడ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచే క్రీడాకారులను జాతీయ స్థాయికి ఎంపిక చేస్తామని తెలిపారు.

పోటీ పరీక్షలకు సిద్ధం చేయండి



అభివృద్ధి పనుల సామగ్రిని పరిశీలిస్తున్న డీఐఈఓ రవిబాబు

ఏన్కూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులను నీట్, ఎప్‌సెట్ తదితర పోటీ పరీక్షలకు సిద్ధం చేయాలని జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి రవిబాబు సూచించారు. ఏన్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం తనిఖీ చేసిన ఆయన అభివృద్ధి పనులు, ఉపయోగిస్తున్న సామగ్రిని పరిశీలించారు. అనంతరం అధ్యాపకులతో సమావేశమైన డీఐఈఓ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా బోధన అందించాలని, ప్రాక్టికల్స్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. ఆతర్వాత లైబ్రరీ దినోత్సవం సందర్భంగా లైబ్రేరియన్ కవితను సన్మానించారు. ప్రిన్సిపాల్ సింహాచలం, అధ్యాపకులు సుందర్, కృష్ణప్రసాద్, బాబులాల్, రామారావు, వెంకటేశ్వరావు, విజయలక్ష్మి, నర్సింహారావు, రమాదేవి, కిషోర్‌బాబు పాల్గొన్నారు.

స్టేషన్‌ను కొనసాగించాల్సిందే...



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

చింతకాని: మండలంలోని నాగులవంచ రైల్వే స్టేషన్‌ను ఎత్తివేయకుండా కొనసాగించాలని పలువురు డిమాండ్ చేశారు. ఈమేరకు పాతర్లపాడు, నాగులవంచ రైల్వేకాలనీ, రామాపురం గ్రామాల ప్రజలు, విద్యార్థులు మంగళవారం ఆందోళన నిర్వహించారు. ప్రయాణికుల ఆదరణ లేదంటూ నాగులవంచ రైల్వేస్టేషన్‌ను మూసివేస్తున్నట్లు ఇటీవల అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. స్టేషన్ మూసివేతతో చుట్టుపక్కల పదికి పైగా గ్రామాల ప్రజలు ఇబ్బంది పడనున్నందున అధికారులు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆందోళన సందర్భంగా స్థానికులు కోరారు.



కూసుమంచి: పాలేరు రిజర్వాయర్‌కు ఓ పక్క సాగర్ జలాలు.. ఇంకో పక్క వాగుల ద్వారా వరద వస్తుండగా గరిష్ట స్థాయి నీటి మట్టం 23 అడుగులు దాటి 24 అడుగులకు చేరింది. రిజర్వాయర్‌కు వచ్చే వరద మంగళవారం ఉదయం 6,660 క్యూసెక్కులుగా ఉండగా.. రాత్రికల్లా 17వేల క్యూసెక్కులకు పెరిగింది. దీంతో అప్రమత్తమైన అధికారులు సాగర్ నుంచి ప్రవాహాన్ని తగ్గించారు. పరిస్థితులను జలవనరుల శాఖ ఎస్ఈ ఎం.వెంకటేశ్వర్లు, ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, కూసుమంచి సీఐ సంజీవ్ పర్యవేక్షించారు.



వైరా: వైరా రిజర్వాయర్ నీటి మట్టం రోజురోజుకూ పెరుగుతోంది. గత రెండు రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో వరద చేరుతోంది. మంగళవారం నాటికి వైరా రిజర్వాయర్ నీటి మట్టం 18.8 అడుగులకు చేరింది. పూర్తి స్థాయి నీటి మట్టం 18.3 అడుగులు కాగా అంతకు మించి వరద చేరడంతో రిజర్వాయర్ నాలుగు అలుగుల ద్వారా వరద బయటకు వెళ్తోంది. దీంతో వైరా నది పొంగి ప్రవహిస్తోంది. రిజర్వాయర్ కింద రైతులు ఇప్పటికే వరి నార్లు సిద్ధం చేసుకోగా నాట్లు వేస్తున్నారు.

ఎగువన వాన.. దిగువన వరద

పొంగి పొర్లుతున్న ప్రాజెక్టులు, చెరువులు

- పాలేరు, వైరా రిజర్వాయర్ల నుంచి నీటి విడుదల
- అదునులో నీటి వసతితో ఊపందుకున్న పంటల సాగు
- మొత్తం విస్తీర్ణంలో వరి, పత్తిదే సింహభాగం

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ఎగువ జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలతో జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువులకు వరద చేరుతోంది. అంతేకాక జిల్లాలోనూ గత నెలలో వర్షాలు పడడం, ఈ నెలలోనూ అడపాదడపా వర్షంతో నీటి వనరులు జలకళ సంతరించుకున్నాయి. భారీ, మధ్య తరహా ప్రాజెక్టులతోపాటు పలు చెరువులు పొంగి పొర్లుతున్నాయి. జిల్లాలో పంటల సాగుకు కీలకమైన పాలేరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, వైరా మధ్యతరహా ప్రాజెక్టుల్లో నిండా నీటితో దిగువకు వదులుతుండగా పంటల సాగు ఊపందుకుంది. ఈ సీజన్‌లో అన్ని పంటలు కలిపి 5,77,776 ఎకరాల్లో సాగవుతున్నాయి. ఇందులో అత్యధికంగా వరి, పత్తి ఉండగా.. వరి సాగు మరింత పెరిగే అవకాశముందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

ఎగువన వర్షాలతో..

జిల్లాకు ఎగువన ఉన్న వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో ఇటీవల భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వరద దిగువన ఉన్న జిల్లాకు చేరుతోంది. మరోవైపు నాగార్జున సాగర్ ప్రాజెక్టు నుంచి విడుదల చేసిన నీటితో పాలేరు రిజర్వాయర్ కళకళలాడుతోంది. ఇవేకాక పలు ప్రాజెక్టులు, చెరువులు నిండాయి. ఖమ్మంలో మున్నేటికి కూడా వరద తగ్గుతూ పెరుగుతోంది. తిరుమలాయపాలెం మండలంలోని సుబ్లేడు -మేడిదపల్లి మధ్య వాగు, చింతకాని మండలంలో బండిరేవువాగు ప్రవాహంతో నాగులవంచ-పాతర్లపాడు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కాగా, జిల్లాలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు సగటున 2.22 సెం.మీ. వర్షపాతం నమోదు కాగా.. కూసుమంచి, ముదిగొండ మండలాల్లో భారీ వర్షం కురిసింది. అత్యధికంగా కూసుమంచి మండలంలో 10.38 సెం.మీ., ముదిగొండ మండలంలో 7.04 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

మూడు నెలల్లో 47 సెం.మీ.లు..

జిల్లాలో జూన్, జూలై, ఆగస్టు నెలల్లో 46.5 సెం.మీ. సాధారణ వర్షపాతానికి గాను 47 సెం.మీ.గా నమోదైంది. జూన్‌లో 13.1 సెం.మీ.కు 12.3, జూలైలో 24సెం.మీ.కు 28.1, ఆగస్టులో ఇప్పటి వరకు 9.3 సెం.మీ.కు గాను 6.5 సెం.మీ. వర్షపాతం నమోదైంది. గత రెండు నెలలతో పోలిస్తే ఈనెల ప్రాజెక్టులు, చెరువుల్లోకి వరద ఎక్కువగా చేరుతుండడంతో చెరువులకు జలకళ వచ్చింది.

ప్రాజెక్టుల్లో నీటి నిల్వ వివరాలు (అడుగుల్లో)

ప్రాజెక్టు	నిల్వ సామర్థ్యం	ప్రస్తుత నిల్వ
పాలేరు రిజర్వాయర్	23	24
వైరా రిజర్వాయర్	18.03	18.08
బేతుపల్లి	16	15
జాలిముడి	15	15.01
కట్టలేరు	07	8.06
లంకాసాగర్	16	10.06

జిల్లాలో చెరువుల వివరాలు..

చెరువుల సంఖ్య	నీటి నిల్వ (శాతం)
78	25
203	25 - 50
278	50 - 75
270	75 - 100
170	90 - 100
62	అలుగు

ఉధృతంగా ప్రవాహం

జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువుల్లోకి స్థానిక వాగుల ద్వారా వచ్చే వరదకు తోడు నాగార్జున సాగర్ ప్రాజెక్టు నీరు కూడా వస్తోంది. పాలేరు రిజర్వాయర్‌లోకి సాగర్ ఎడమకాల్వ నుంచి 3,442 క్యూసెక్కులు, ఎగువన పరీవాహక ప్రాంతం నుంచి 6,661 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. దీంతో నీటినిల్వ సామర్థ్యం 23 అడుగులకు 24అడుగులు నమోదవడంతో 7,780 క్యూసెక్కులను స్పిల్‌వే గేట్ల ద్వారా, 2,163 క్యూసెక్కులను కాల్వల ద్వారా దిగువకు వదులుతున్నారు. అలాగే, వైరా ప్రాజెక్టు నుంచి అలుగుల ద్వారా 1,100 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 80 క్యూసెక్కులు, కుడికాల్వ ద్వారా 100 క్యూసెక్కుల నీరు పొలాలకు చేరుతోంది. ఇక జాలిముడి ప్రాజెక్టులోకి 44 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. అంతే మొత్తం దిగువకు వదులుతున్నారు. కట్టలేరుకు 7,302 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండడంతో అదే స్థాయిలో విడుదల చేస్తున్నారు. ఇక ఖమ్మంలోని మున్నేరు నదిలో ఆరు అడుగుల మేర నీరు ఉండగా, 15,088 క్యూసెక్కుల నీరు వస్తోంది.

5.77 లక్షల ఎకరాల్లో..

ఈ వానాకాలం జిల్లాలో అన్ని పంటలు కలిపి 6,34,255 ఎకరాల్లో సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకు 5,77,776 ఎకరాల్లో సాగు కాగా వరి 2,13,371ఎకరాలు, పత్తి 2,20,650 ఎకరాలుగా నమోదైంది. ఇక పెసలు 17,318, మొక్కజొన్న 1,613 ఎకరాల్లో, ఇతర పంటల 1,24,824 ఎకరాల్లో సాగవుతున్నాయి. వరి మరో 81,729 ఎకరాల్లో సాగవుతుందని అంచనా.

యూరియా కష్టాలు తీరవా?

- పీఏసీఎస్‌ల ముందు రైతుల బారులు
- సరిపడా అందక ఆందోళన



కారేపల్లి సొసైటీ కార్యాలయంలో కూపన్ల కోసం రైతుల బారులు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: పంటల సాగు జోరందుకున్న వేళ ఏపుగా పెరగడానికి యూరియా అవసరం. కానీ పడిగాపులు కాస్తున్నా సరిపడా అందక అదును దాటుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పీఏసీఎస్‌లకు యూరియా స్టాక్ వచ్చిందని తెలియగానే పరుగులు తీస్తున్నారు. మునుపెన్నడూ ఈ పరిస్థితి లేకపోగా, ఈసారి యూరియా కోసం ఇబ్బంది పడాల్సి వస్తోందని వాపోతున్నారు. జిల్లాలోని కారేపల్లి, కొణిజర్లల్లో మంగళవారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. నిత్యం రెండు, మూడు చోట్ల ఇదే పరిస్థితి ఎదురవుతుండగా పలుచోట్ల ఆందోళనలు కూడా చేస్తున్నారు. అయితే, కేంద్రం నుంచే యూరియా తగినంత రావడం లేదని, ఉన్న వరకు ఇస్తున్నామంటూ పీఏసీఎస్‌ల బాధ్యులు సర్దిచెబుతున్నారు.

ఈ మూడు నెలలే కీలకం..

యూరియా ఎక్కువగా పత్తి, వరి పంటలకే అవసరమవుతుంది. పత్తికి నాలుగైదు సార్లు యూరియా వేయాల్సి ఉంటుంది. ఇక వరి నాట్లు ముమ్మరమవుతుండడంతో పంటలకు కావల్సినంతా యూరియా అందుబాటులో ఉండాలి. ప్రధానంగా వచ్చే రెండు నెలల్లో వరికి యూరియా కీలకం కానుంది. కాగా, ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు 54,826 మెట్రిక్ టన్నుల యూరియా పంటలకు అవసరమని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో ఇప్పటి వరకు జిల్లాకు 15,719 మెట్రిక్ టన్నులే సరఫరా అయింది. ఈ సీజన్‌లో 12,414 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందజేశారు. వచ్చే నెలలో జిల్లాకు 21,244 మెట్రిక్ టన్నుల అవసరం ఉంటుందని అంచనా. పత్తి, వరి పంటలకు యూరియా కీలకం కావడంతో రైతులతో పాటు అధికారులు కూడా గండం గట్టెక్కడం ఎలా అన్న ఆలోచనలో పడ్డారు.

జిల్లాలో యూరియా అవసరం, సరఫరా (మెట్రిక్ టన్నుల్లో)

నెల	అవసరం	సరఫరా
జూలై	7,500	6,434
ఆగస్టు	4,610	1,631
సెప్టెంబర్	21,244	---

పెసర చేతికి వచ్చేసింది!

- ఖమ్మం మార్కెట్‌లో కొత్త పంట విక్రయాలు
- దిగుబడి రాక.. ధర దక్కక రైతుల ఆవేదన



ఖమ్మం మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన పెసలు

ఖమ్మంవ్యవసాయం: ప్రస్తుత వానాకాలంలో సాగు చేసిన పెసర చేతికికొస్తోంది. ఈమేరకు రైతులు పంటను ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు తీసుకొస్తున్నారు. మే నెల చివరి వారంలో కురిసిన వర్షాలకు మెట్ట పైరుగా పలువురు రైతులు పంట సాగు చేశారు. ఈ వానాకాలం పంట సాధారణ సాగు విస్తీర్ణం 16,838 ఎకరాలు కాగా 17,318 ఎకరాల్లో సాగైంది. ఖమ్మం అర్బన్, కొణిజర్ల, రఘునాథపాలెం, బోనకల్, చింతకాని, నేలకొండపల్లి, కూసుమంచి, ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం, కామేపల్లి, మధిర, ఎర్రుపాలెం, ముదిగొండ, వైరా తదితర మండలాల్లో ఎక్కువగా సాగు చేయగా ప్రస్తుతం చేతికందుతోంది. అయితే దిగుబడి మాత్రం ఎకరాకు రెండు నుంచి రెండున్నర క్వింటాళ్లే రావడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

పంటల పెట్టుబడి కోసం..

ఖమ్మం మార్కెట్‌లో ఇప్పుడిప్పుడే కొత్త పెసల విక్రయం ఊపందుకుంటోంది. జిల్లాలో ఇప్పటికే పత్తి సాగు పూర్తికాగా, వరి నాట్లు కొనసాగుతున్నాయి. మిరప సాగుకు కూడా సమయం ఆసన్నం కావడంతో ముందుగా చేతికందిన పెసలు విక్రయించి నగదును ఇతర పంటల పెట్టుబడికి వినియోగించనున్నారు. ఈమేరకు రెండు, మూడు రోజుల నుంచి ఖమ్మం మార్కెట్‌కు పది నుంచి పదిహేను క్వింటాళ్ల పెసలు తీసుకొస్తున్నారు. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం పెసలు క్వింటాకు మద్దతు ధర రూ.8,768గా నిర్ణయించింది. కానీ ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం గరిష్టంగా రూ.6,660, మోడల్ ధర రూ.6,350, కనిష్ట ధర రూ.5,900గా నమోదైంది. మద్దతు ధరతో పోలిస్తే రూ.2 వేలకు పైగా తేడా ఉన్నప్పటికీ.. ప్రభుత్వం కొనుగోళ్లు లేక వ్యాపారులు చెప్పిన ధరకే అమ్ముకోవాల్సి వస్తోంది.

దిగుబడి రాలేదు.. ధర లేదు



వర్షాధారంగా నాలుగెకరాల్లో పెసర సాగు చేస్తే ఎకరాకు రెండున్నర క్వింటాళ్ల చొప్పున పది క్వింటాళ్ల దిగుబడే వచ్చింది. మార్కెట్‌కు తీసుకొస్తే క్వింటాకు రూ.6వేలతో తీసుకున్నారు. ప్రభుత్వం కొనుగోలు చేస్తే మరో రూ.25వేలకు పైగా లభించేవి.

– కె.సైదులు, అల్లీపురం, ఖమ్మం అర్బన్ మండలం

72 గంటలు అప్రమత్తంగా ఉండాలి

- వరద ముంచెత్తితే రంగంలోకి హెలీకాప్టర్లు
- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి



వరద పరిస్థితులపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందన్న సూచనలతో అధికారులు రానున్న 72 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడా ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి మంగళవారం ఆయన పలువురు మంత్రులు, సీఎస్ రామకృష్ణారావులతో కలిసి వీసీ ద్వారా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు బృందాలను సిద్ధం చేయడమే కాక అవసరమైన హెలీకాప్టర్లు సమకూర్చుకోవాలని తెలిపారు. గత సంవత్సరం ఖమ్మంలో ఎదురైన ఇబ్బంది ఎక్కడా పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. ఖమ్మం తదితర కార్పొరేషన్లలో ప్రత్యేక అధికారులను నియమించి 24గంటలు పాటు పర్యవేక్షించాలని తెలిపారు. వీసీ అనంతరం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులతో సమావేశమై వరద ముంపు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్, అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు, డీఎంహెచ్‌ఓ కళావతిబాయి, డీఆర్‌ఓ పద్మశ్రీ, సీపీఓ ఏ.శ్రీనివాస్, ఇరిగేషన్ ఎస్ఈలు వెంకటేశ్వర్లు, వాసంతి, ఆర్‌డీఓ నర్సింహారావు, ఆర్ అండ్ బీ, మిషన్ భగీరథ ఈఈలు తానేశ్వర్, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరు నమోదు

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును ఎఫ్ఆర్ఎస్(ఫేస్ రికగ్నైజేషన్ సిస్టమ్) ద్వారానే నమోదు చేయాలని కలెక్టర్ అనుదీప్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి హాజరు నమోదు తదితర అంశాలపై సమీక్షించిన ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల, విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు.

అంతేకాక ఉపాధ్యాయుల డిప్యూటేషన్లపై సమీక్షించి విద్యార్థులు అధికంగా ఉన్న 237 పాఠశాలల్లో ఇబ్బంది రాకుండా చూడాలని చెప్పారు. అలాగే, కేజీబీవీల్లో ఎఫ్ఆర్ఎస్, కాంట్రాక్టు ఉద్యోగుల పనితీరు, అపార్ నంబర్ల కేటాయింపు, పీఎం శ్రీ పాఠశాలల విద్యార్థుల క్షేత్రస్థాయి సందర్శనలు, ఒక రోజు బ్యాగ్ లెస్ డే నిర్వహణపై సూచనలు చేశారు. ఈ సమావేశంలో డీఈఓ నాగ పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు భరోసాగా సఖి కేంద్రాలు

ఖమ్మం క్రైం: సఖి కేంద్రాల ద్వారా మహిళల హక్కులపై అవగాహన కల్పిస్తూనే అన్యాయానికి గురైన వారికి బాసటగా నిలవాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి ప్రాంగణంలోని సఖి కేంద్రం, వన్ స్టాప్ సెంటర్, షీ టీమ్, భరోసా కేంద్రాలను తనిఖీ చేసిన ఆయన సెంటర్‌ను ఆశ్రయించిన వారి వివరాలు బాధితులకు అందించిన సాయంపై ఆరా తీశారు. ఇప్పటివరకు 2,338 మందికి సేవలు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అన్యాయానికి గురైన మహిళలు హెల్ప్‌లైన్ 181 ఫోన్ చేసేలా విస్తృత ప్రచారం చేయాలని చెప్పారు. జిల్లా సంక్షేమ అధికారి కె.రాంగోపాల్ రెడ్డి, సెంటర్ అడ్మినిస్ట్రేటర్ ఆర్.అరుణ, కోఆర్డినేటర్ జి.రాజకుమారి, సిబ్బంది ఈ.అంజని, టి.శ్రావణి, కె.సరిత, ఎం.సుమలత, ఎం.పుష్పలత, ఎస్.నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

పులిగుండాల అభివృద్ధికి రూ.4.20కోట్లు

- కిన్నెరసాని, భద్రాచలం, పులిగుండాల సందర్శనకు ప్యాకేజీ
- డీఎఫ్‌ఓ సిద్ధార్థ విక్రమ్ సింగ్



వీఎస్ఎస్ సభ్యులతో మాట్లాడుతున్న డీఎఫ్‌ఓ

సత్తుపల్లిటౌన్: జిల్లాలోని పులిగుండాల అటవీ ప్రాంతాన్ని ఎకో టూరిజం విభాగంలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రూ.4.20 కోట్లు మంజూరు చేసిందని జిల్లా అటవీ శాఖాధికారి సిద్ధార్థ విక్రమ్‌సింగ్ తెలిపారు. ఇందులో మొదటి విడతగా రూ.1.89 కోట్లు విడుదలయ్యాయని వెల్లడించారు. సత్తుపల్లి చెక్‌పోస్టు, క్వార్టర్లు, టింబర్ డిపోను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం కంటైనర్ ఆస్పత్రి, వాచ్‌టవర్‌ను పరిశీలించాక చంద్రాయపాలెంలో వనసంరక్షణ సమితి బాధ్యులతో మాట్లాడారు. పులిగుండాల ఎకో టూరిజం, కిన్నెరసాని, భద్రాచలంను సందర్శించేలా ప్యాకేజీ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటే టెంట్‌తో బస ఏర్పాటు చేస్తామని, పులిగుండాల వద్ద బ్యాటరీ వాహనంతో పాటు రెండు సఫారీ వాహనాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. సందర్శకుల కోసం సోలార్‌బోట్ సమకూర్చడమే కాక ప్రాజెక్టు వద్ద రక్షణ కోసం ఫెన్సింగ్, 30 కి.మీ. సఫారీ రూట్, కాకతీయుల తోరణంతో గేట్, రిసెప్షన్ సెంటర్ నిర్మించనున్నట్లు తెలిపారు. పులిగుండాల గుట్టపై పల్లెర్ల బావి, వీరభద్రస్వామి ఆలయం, పాలపిట్ట వాచ్ టవర్‌తో పాటు జలపాతం సందర్శకులకు ఆహ్లాదాన్ని అందిస్తాయని చెప్పారు. కాగా, గూడూరు, లోకారం, చంద్రాయపాలెం, వీఎస్ఎస్ సభ్యుల ఆర్థికాభివృద్ధి కోసం కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయించి ఉత్పత్తులను మహిళా మార్ట్‌తో అనుసంధానం చేస్తామని డీఎఫ్‌ఓ తెలిపారు.

పోడుదారులపై చర్యలు

అడవిలో పోడు చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవని డీఎఫ్‌ఓ సిద్ధార్థ విక్రమ్‌సింగ్ హెచ్చరించారు. అటవీ సంరక్షణ, అక్రమ తవ్వకాల నివారణ, వన్యప్రాణి రక్షణ, అటవీ అభివృద్ధిపై వీఎస్ఎస్ సభ్యులతో చర్చించాక సూచనలు చేశారు. సత్తుపల్లి ఎఫ్‌డీఓ వి.మంజుల, టాస్క్‌ఫోర్స్ రేంజర్ శ్రీనివాసరావు, వైల్డ్‌లైఫ్ ఎక్స్‌పర్ట్ దీపక్‌నారాయణ పాల్గొన్నారు.

రైతు బీమాకు సమయమేది?

పథకంలో చేరేందుకు నేటి వరకే అవకాశం

ఖమ్మంవ్యవసాయం: రైతు బీమా పథకంలో చేరేందుకు గడువు తక్కువగా ఉండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టాదారు పాస్ పుస్తకాలు కలిగిన అర్హులైన రైతులు ఈ నెల 13వ తేదీలోగా పూర్తి ఆధారాలతో నమోదు చేసుకోవాలని ప్రభుత్వం శనివారం(9వ తేదీన) ప్రకటించింది. ఈ విషయం 10వ తేదీన రైతులకు చేరగా, మూడు రోజుల సమయమే మిగలడం గమనార్హం. ఇక బుధవారంతో గడువు ముగియనుండగా ఏఈఓలు దరఖాస్తులు స్వీకరించి పోర్టల్‌లో నమోదు చేయాలి. కానీ సర్వర్ సమస్య ఏర్పడడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. జిల్లాలో రైతు బీమా పథకానికి 2,09,387 మంది అర్హులుగా తేల్చారు. వీరిలో రెన్యూవల్ పోగా తప్పులు దొర్లిన రైతులు, కొత్త పాస్ పుస్తకాలు జారీ అయిన వారు అన్ని ధ్రువపత్రాలతో ఏఈఓలకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఏటా జూలై చివరి వారంలో ప్రకటన చేసే ప్రభుత్వం ఈసారి కొద్దిరోజుల ముందే ప్రకటించడంతో అన్ని ధ్రువపత్రాలు సిద్ధం చేసుకునేందుకు రైతులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇదే సమయాన వానాకాలం వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నందున గడువు పెంచాలని అన్నదాతలు కోరుతున్నారు. ఈ విషయమై జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్యను వివరణ కోరగా గడువులోగా అర్హులైన నూతన పట్టాదారు పాస్ పుస్తకం పొందిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సోమవారం సర్వర్ సమస్య తలెత్తినా ఆతర్వాత ఇబ్బందులేమీ ఎదురుకాలేదని తెలిపారు.

క్లుప్తంగా

ఢిల్లీ కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఎన్నికల్లో ఓటు వేసిన ఎంపీ



బాల్క సుమన్, బడుగుల లింగయ్యతో రవిచంద్ర

ఖమ్మంవైరారోడ్: ఢిల్లీ కాన్‌స్టిట్యూషన్ క్లబ్ పాలక మండలి ఎన్నికలు మంగళవారం జరగగా రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఓటు వేశారు. ప్రతిష్ఠాత్మక కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో ఎంపీలతో పాటు మాజీ ఎంపీలు సభ్యులుగా కొనసాగుతారు. ఈమేరకు పోలింగ్‌లో వద్దిరాజుతో పాటు మాజీ ఎంపీలు బడుగుల లింగయ్య యాదవ్, బాల్కన్ సుమన్ తదితరులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఊర చెరువు బుంగకు మరమ్మతులు



మరమ్మతు పనుల వద్ద అధికారులు

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల గ్రామ ఊర చెరువుకు వర్షానికి బుంగ పడింది. దీంతో నీరు వృథాగా పోతుండగా మంగళవారం ఇరిగేషన్ డీఈ తమ్మారపు వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రమాదేవి ఆధ్వర్యాన బుంగ పూడ్చించారు. అలాగే, తూము పైపులైన్లు పగిలిన చోట కొత్తవి వేయించారు.

భూదాన్ భూమిలో నిర్మాణంపై అభ్యంతరం



కాలనీవాసులతో చర్చిస్తున్న అధికారులు

ఖమ్మం అర్బన్: ఖమ్మం వెలుగుమట్ల గుట్టపై ఏర్పాటైన వినోబా నవోదయ కాలనీ సమీపాన వాటర్ ట్యాంక్, ప్రహరీనిర్మాణాన్ని కాలనీ వాసులు మంగళవారం అడ్డుకున్నారు. ఇక్కడ 12ఏళ్ల నుంచి పలువురు నివాసం ఉంటుండగా.. ప్రొసీడింగ్స్, ఇంటి నంబర్లు పొందినా విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించలేదని ఆరోపిస్తున్నారు. ఈనేపథ్యాన కోర్టులో స్టేటస్‌కో ఉన్న భూమిని ప్రభుత్వ భూమిగా చెబుతూ ప్రహరీ నిర్మించడం సరికాదని జేసీబీలు, ప్రొక్లెయినర్లతో వచ్చిన రెవెన్యూ, పోలీసు సిబ్బందిని అడ్డుకున్నారు. దీంతో తహసీల్దార్ సైదులు, సీఐ భానుప్రకాష్ చేరుకుని వారితో చర్చించారు. అయితే, తమకు విద్యుత్, నీటి సౌకర్యం కల్పించాలని హైకోర్టు ఆదేశించినా పట్టించుకోలేదని స్థానికులు పేర్కొనడంతో ప్రజా అవసరాలు తీర్చే నిర్మాణాలకు సహకరించాలని అధికారులు సూచించారు. కాగా, ట్యాంక్ ద్వారా తమకు నీరు అందించడమే కాక విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

'జాతీయ క్రీడా బిల్లు'పై మాట్లాడిన ఎంపీ రవిచంద్ర

ఖమ్మంవైరారోడ్: రాజ్యసభలో మంగళవారం జాతీయ క్రీడలపాలన బిల్లు, ఉత్ప్రేరకాల నిరోధక బిల్లును కేంద్ర యువజన, క్రీడల శాఖ మంత్రి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడారు. క్రీడలు, క్రీడాకారులకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు పదేళ్ల పాలనలో ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. దీంతో రాష్ట్ర క్రీడాకారులు పలువురు అంతర్జాతీయ వేదికలపై ప్రతిభ చాటారని వెల్లడించారు. అంతేకాక క్రీడారంగానికి అత్యధిక నిధులు కేటాయించి జిల్లా కేంద్రాలు, అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్టేడియం నిర్మించారని తెలిపారు. అయితే, కేంద్రప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో క్రీడారంగానికి రూ.2161 కోట్లు కేటాయించి తెలంగాణకు కేవలం రూ.17 కోట్లే ఇవ్వడంస సరికాదని పేర్కొన్నారు. ఇకనైనా కేటాయింపుల్లో సవరణలు చేయాలని ఎంపీ రవిచంద్ర కోరారు.

డైట్ ప్రిన్సిపాల్‌గా మేర్‌జుల్లా ఖాన్

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం డైట్ ప్రిన్సిపాల్‌గా మహ్మద్ మేర్‌జుల్లా ఖాన్ నియమితులయ్యారు. మహబూబ్‌నగర్ డైట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్న ఆయనకు ఖమ్మం ప్రిన్సిపాల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక్కడ డైట్ ప్రిన్సిపాల్‌గా ఉన్న సత్యనారాయణ ఉద్యోగ విరమణ చేయడంతో మేర్‌జుల్లా ఖాన్‌ను నియమించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	2,000	2,000
కందులు	4,200	4,200
మినుములు	5,700	5,700
ఏసీ మిర్చి	14,525	8,000
మిర్చి	8,600	5,000
పత్తి	7,800	6,000

– ఖమ్మం వ్యవసాయం

పడిగాపులు కాసినా ఫలితం ఏదీ?



కారేపల్లి సొసైటీ కార్యాలయం వద్ద రైతుల క్యూ

- యూరియా కోసం రైతుల వెతలు
- రేషన్ విధానంలో పంపిణీపై అసహనం

కారేపల్లి: యూరియా కోసం రైతులు పడుతున్న ఇక్కట్లు అన్నీఇన్నీ కావు. సొసైటీ కార్యాలయాల వద్ద పొద్దంతా పడిగాపులు కాసినా రెండుకు మించి బస్తాలు ఇవ్వకపోవడం.. పంటలకు అవసరం పెరుగుతుండంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. కారేపల్లి విశాల సహకార పరపతి సంఘం(సొసైటీ) పరిధి గ్రామాల్లో సుమారు 5వేల ఎకరాల్లో వరి సాగవుతోంది. కానీ సొసైటీ ద్వారా రెండు నెలల్లో 7,244(3259.80 క్వింటాళ్లు) యూరియా బస్తాలను 2682 మంది రైతులకు పంపిణీ చేశారు. జూన్‌లో వ్యవసాయ భూమి ఆధారంగా ఐదు బస్తాల వరకు పంపిణీ చేయగా.. జూలైలో ఎంత భూమి ఉన్నా రెండేసి బస్తాలే ఇచ్చారు. ఇక ఈనెలలోనూ అదే పరిస్థితి ఉండడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం యూరియా అవసరం పెరగడంతో సొసైటీకి ఎప్పుడు స్టాక్ వచ్చిందని తెలిసినా ఉదయం లైన్ కడుతున్నారు. రోజంతా వేచి ఉన్నా ఒకటి, రెండు బస్తాలే ఇస్తున్నారని రైతులు వాపోతున్నారు.

పని వదిలేసుకుని వచ్చా....



నేను పని వదిలేసుకుని రోజంతా లైన్‌లో ఉన్నా. నాలుగెకరాల్లో పత్తి వేశానని చెప్పినా రెండు యూరియా కట్టలే ఇచ్చారు. ఈ యూరియా పంటకు ఎటూ సరిపోదు. పెద్ద సార్లు అవసరం తగ్గట్టుగా యూరియా ఇవ్వకపోతే పంట నష్టపోతాం.

– భూక్యా తులిస్యా, రైతు, వెంకిట్యాతండా

రెండు బస్తాలే ఇచ్చారు...



పది ఎకరాల్లో వరి సాగు చేస్తున్నా. కానీ రెండు యూరియా బస్తాలే ఇచ్చారు. దీనికోసం నేను పని వదిలేసు కొని పొద్దాక ఉండాల్సి వచ్చింది. యూరియా వేయకపోతే దిగుబడి తగ్గుతుంది. అధికారులు ఆలోచించి సరిపడా ఇవ్వాలి.

– ఉప్పుగండ్ల శ్రీనివాసరావు, రైతు, పేరుపల్లి

రైతుల ఆందోళన



రైతులతో మాట్లాడుతున్న ఏఓ బాలాజీ, ఎస్‌ఐ సూరజ్

కొణిజర్ల: యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు ఆందోళనకు సిద్ధం కాగా అధికారులు నచ్చచెప్పారు. కొణిజర్ల మండలంలోని సాలెబంజర, సింగరాయపాలెం, తీగలబంజర, కొణిజర్ల తదితర గ్రామాల రైతులు యూరియా కోసం మంగళవారం కొణిజర్లలో సొసైటీ కార్యాలయానికి వచ్చారు. కానీ స్టాక్ లేదని సిబ్బంది చెప్పడంతో రైతులు ఆగ్రహంగా రోడ్డుపై బైఠాయించేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయం తెలిసి ఎస్‌ఐ జి.సూరజ్ చేరుకుని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని నచ్చచెప్పడంతో వారు వెనక్కి తగ్గారు. అనంతరం ఏఓ బాలాజీ మాట్లాడుతూ రెండు రోజులలో యూరియా రానుందని తెలిపారు.

ఆయువు పోయినా.. ఆయుష్షు పోస్తూ..



- అవయవదానానికి ముందుకొస్తున్న కుటుంబాలు
- ఉమ్మడి జిల్లాలో పెరిగిన అవగాహన

నేడు ప్రపంచ అవయవదాన దినోత్సవం

సుజాతనగర్: అమ్మ జన్మనిస్తే అవయవదానం పునర్జన్మనిస్తుంది.. మరణించినా కళ్లు మాత్రం ఈ లోకాన్ని చూస్తూనే ఉంటాయి. ఏ లోకంలో ఉన్నా మూత్రపిండాలు రక్తాన్ని శుద్ధి చేస్తూనే ఉంటాయి. శ్వాస ఆగిపోయినా గుండె మాత్రం లబ్ డబ్ అని కొట్టుకుంటూనే ఉంటుంది.. 'ఆయువు పోయినా.. అవయవదానంతో ఊపిరిపోద్దాం.. అవయవాలను ఈ లోకంలో జీవించనిద్దాం.. రండి అవయదానం చేద్దాం.. మరణించినా మరో వ్యక్తిలో జీవించే ఉందాం'.. అంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు స్వచ్ఛంద సంస్థలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నా కొందరు అపోహలు, అనుమానాలతో వెనకడుగు వేస్తున్నారు. కానీ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మాత్రం అవయవదానంపై అవగాహన పెరుగుతోంది. ఈ విషయమై విస్తృత అవగాహన కోసం ఏటా ఆగస్టు 13న 'ప్రపంచ అవయవదాన దినోత్సవం' నిర్వహిస్తున్నారు.

● ఖమ్మం.. మెహర్‌కుమార్



ఖమ్మం చర్చి కాంపౌండ్‌కు చెందిన తుమ్మటి మెహర్‌కుమార్ ప్రైవేట్ ఉద్యోగి. గత ఏడాది ఇంట్లో ఉన్న సమయంలో ఉన్నట్టుండి కింద పడ్డాడు. గమనించిన కుటుంబీకులు సమీపంలోని ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. అత్యవసర చికిత్స అందించిన వైద్యులు బ్రెయిన్‌డెడ్ అయినట్లు నిర్ధారించారు. ఆపై కుటుంబీకులకు అవయవదానంపై అవగాహన కల్పించగా.. ఆయన నుంచి కాలేయం సేకరించి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి అమర్చారు.

● పెరికసింగారం.. నవీన్



కూసుమంచి మండలం పెరికసింగారం గ్రామానికి చెందిన బత్తుల నవీన్ ఓ కంపెనీలో సేల్స్ బాయ్‌గా పనిచేసేవాడు. గత ఏడాది జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో ఆయనను హైదరాబాద్‌కు తరలించి చికిత్స చేయిస్తుండగా బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. వైద్యులు అవగాహన కల్పించగా, ఆయన కుటుంబీకులు అవయవాలను దానం చేశారు.

● నారాయణపురం.. యమున



తల్లాడ మండలం నారాయణపురానికి కమ్మగంటి యమున 9నెలల కిందట ఇంట్లో కళ్లు తిరిగి పడిపోయింది. కుటుంబీకులు స్థానికంగా చికిత్స అనంతరం హైదరాబాద్ తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించారు. కుటుంబీకులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. రెండు కిడ్నీలు, కాలేయం, ఒక ఊపిరితిత్తి సేకరించి ప్రాణాపాయస్థితిలో ఉన్న నలుగురికి శస్త్ర చికిత్స ద్వారా అమర్చారు.

ఆకేరు అక్విడెక్ట్‌కు అడ్డుగా గుట్టలు

- నానాటికీ పెరుగుతున్న వరద ప్రవాహం
- రాకాసితండా వాసుల్లో ఆందోళన



సీతారామ అక్విడెక్ట్‌కు ఆనుకుని ప్రవహిస్తున్న ఆకేరు



కానాలకు అడ్డుగా ఉన్న బండరాళ్లు

తిరుమలాయపాలెం: జిల్లాలో వర్షం లేకున్నా.. వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షం కురిస్తే ఆకేరు నదికి వరద పోటెత్తుతుంది. ప్రస్తుతం అదే పరిస్థితి ఉండడంతో.. గత ఏడాది ప్రళయాన్ని తలుచుకుని మండలంలోని రాకాసి తండా వాసులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది సెప్టెంబర్ 1న భారీ వర్షాలు, వరదలతో తండా మునిగిపోగా స్థానికులు సర్వం కోల్పోయారు. అయితే, సీతారామ ప్రాజెక్టు అక్విడెక్ట్ నిర్మాణంలో కాంట్రాక్టర్ తప్పిదాలతో ఎత్తయిన గ్రామాన్ని వరద ముంచెత్తిందనే ఆరోపణలు వచ్చాయి. వరంగల్ జిల్లాలో సోమవారం రాత్రి భారీ వర్షం కురవగా.. మంగళవారం సాయంత్రానికి ఆకేరు వరద పెరిగి సీతారామ అక్విడెక్ట్‌కు తాకుతూ నీరు ప్రవహిస్తోంది. అక్విడెక్ట్ నిర్మాణం పొడవుగానే ఉన్నా సగం కానాలు(నీరు వెళ్లే మార్గాలు) బండరాళ్లతో నిండి, భారీ గుట్ట అడ్డుగా ఉండడంతో నీరు పైకి పోటెత్తే ప్రమాదముంది. గత ఏడాది నుంచి ఎలాంటి నివారణ చర్యలు చేపట్టకపోవడంతో ఈసారి ఏం జరుగుతుందోనని రాకాసి తండా వాసులు నిత్యావసరాలు, విలువైన వస్తువులను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇప్పటికైనా తమ గోడు ఆలకించి అక్విడెక్ట్‌కు అడ్డుగా ఉన్న బండరాళ్లు, గుట్టలను తొలగించాలని కోరుతున్నారు.

అప్రమత్తంగా విద్యుత్ అధికారులు

ఖమ్మంవ్యవసాయం: భారీ వర్షాల సూచనల నేపథ్యాన విద్యుత్ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశించారు. ఎన్పీడీసీఎల్ పరిధి సూపరింటెండెంట్ ఇంజనీర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడిన ఆయన ఉద్యోగులు కార్యస్థానాల్లో ఉండాలని, నాలుగు రోజుల పాటు ఎవరికీ సెలవులు ఇవ్వొద్దని సూచించారు. వరదల కారణంగా విద్యుత్ అంతరాయాలు ఏర్పడితే వెంటనే మరమ్మతులు చేసేలా సామగ్రి సిద్ధంగా ఉంచుకోవాలని, మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్ వాహనాలను సమకూర్చుకోవాలని తెలిపారు. వినియోగదారులు తమ సమస్యలపై టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేసేలా ప్రచారం చేయాలని సీఎండీ సూచించారు.

బీఆర్‌ఎస్ నాయకుడి హత్యకు సుపారీ?

రూ.4 లక్షలకు ఒప్పందం.. వైరల్‌గా మారిన ఆడియో

కామేపల్లి: గ్రామపెద్దగా వ్యవహరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడి అడ్డు తొలగించేలా ఓ యువకుడు ప్రణాళిక రూపొందించినట్లు తెలిసింది. ఈ విషయాన్ని స్నేహితులకు చెబుతుండగా రికార్డు చేయడంతో ఆడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కామేపల్లి మండలం మద్దులపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడిపై అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు కక్ష పెంచుకుని హత్యకు నిర్ణయించినట్లు తెలిసింది. ఈమేరకు మహబూబాబాద్ జిల్లాకు చెందిన రౌడీ షీటర్‌ను సంప్రదించి సదరు నేతను హత్య చేసేందుకు రూ.4లక్షలతో ఒప్పందం కుర్చుకున్నాడని.. అందులో రూ.లక్ష చెల్లించినట్లు సమాచారం. కాగా, నాయకుడితో పాటు మరో వ్యక్తి చేతులు, కాళ్లు విరగకొట్టేందుకు కూడా సుపారీ మాట్లాడినట్లు తెలిసింది. ఈ విషయాన్ని యువకుడు స్నేహితులకు చెప్పే క్రమాన ఒకరు రికార్డు చేసిన ఆడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఈమేరకు సదరు నాయకుడు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

హౌసింగ్ బోర్డు సెక్రటరీగా రామాలయ ఈఓ

భద్రాచలం : భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయ ఈఓ ఎల్.రమాదేవికి ఇటీవల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి కల్పించిన విషయం విదితమే. ఆమెను ఆర్‌అండ్‌బీ శాఖకు కేటాయించినా ఇప్పటి వరకు పోస్టింగ్ ఇవ్వలేదు. కాగా మంగళవారం.. హౌసింగ్ శాఖలో సెక్రటరీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఇకపై ఆమె హౌసింగ్ శాఖలో విధులు నిర్వర్తించనున్నారు. అయితే, భద్రాచలం రామాలయ ఈఓగా మాత్రం ఇంకా ఎవరినీ నియమించలేదు.

కాపు రాక ఆయిల్‌పామ్ మొక్కల తొలగింపు



మొక్కలను తొలగిస్తున్న జేసీబీ

వేంసూరు: ఆయిల్‌పామ్ సాగుతో దీర్ఘకాలం లాభాలు వస్తాయని రైతులు భావిస్తే ఆఫ్‌టైప్ మొక్కలతో నిరాశే మిగులుతోంది. నాలుగేళ్ల పాటు పెట్టుబడి పెట్టి కంటిపాపలా పెంచిన మొక్కలకు గెలలు రాకపోవడంతో చేసేదేం లేక మొక్కలు తొలగిస్తున్నారు. వేంసూరు మండలం వైఎస్.బంజర్ గ్రామానికి చెందిన మహిళా రైతు కొప్పుల శ్రీదేవి అశ్వారావుపేట నర్సరీ నుంచి మొక్కలు తెచ్చి ఆరెకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేశారు. అయితే, నాలుగేళ్లు దాగినా దిగుబడి రాకపోవడంతో ఆఫ్‌టైప్ మొక్కలుగా తేలింది. ఆయిల్‌ఫెడ్ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతో మంగళవారం జేసీబీతో ఆయా మొక్కలను తొలగించారు.

ఇల్లెందు, మానుకోటకూ.. 'సీతారామ' జలాలు ఇవ్వండి

సీఎంకు విన్నవించిన మాస్‌లైన్ నాయకులు



సీఎం రేవంత్‌రెడ్డికి సమస్యలు వివరిస్తున్న పోటు రంగారావు, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: సీతారామ ప్రాజెక్టును ఇల్లెందు, మహబూబాబాద్, డోర్నకల్ ప్రాంతాలకు సైతం అనుసంధానించి సాగునీరు సరఫరా చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు మంగళవారం మాస్‌లైన్ నాయకులు హైదరాబాద్‌లో మంగళవారం సీఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో సీతారామ ప్రాజెక్టును నిర్మించినా ఇల్లెందు ప్రాంత రైతులకు ప్రయోజనం లేదన్నారు. అన్ని ప్రాంతాలకు సీతారామ నీరు అందేలా చూడాలని కోరారు. అలాగే, పోడు సాగుదారులకు పొజిషన్ హక్కులు కల్పించి, అర్హులకు పట్టాలు జారీ చేయాలని, పోడు రైతులపై అటవీ అధికారుల దాడులను నిలిపివేయించాలన్నారు. అంతేకాక వ్యవసాయ కూలీలకు రూ.12 వేల భృతి, పెన్షన్ పెంపు, మహిళలకు రూ.2,500 చెల్లింపుతో పాటు పెండింగ్ ఉపకార వేతనాలు, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అంతేకాక మంత్రులు జిల్లా పర్యటనలకు వచ్చినప్పుడు మాస్‌లైన్, ఇతర వామపక్షాల పార్టీలు, ప్రజా సంఘాల నాయకులను ముందస్తు అరెస్టు చేస్తున్న విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లగా అధికారులకు సూచనలు చేస్తానని చెప్పారని రంగారావు వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, నాయకులు కేజీ.రాంచందర్, కె.రమ, కె.సూర్యం పాల్గొన్నారు.

రిజర్వాయర్‌లో మృతదేహం

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్‌లో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి(45) మృతదేహం లభ్యమైంది. ఈమేరకు స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు పరిశీలించారు. ఎగువ నుంచి వరద ప్రవాహంలో మృతదేహం కొట్టుకొచ్చినట్లు భావిస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని ఎస్సై నాగరాజు సూచించారు.

నేడు స్వగ్రామానికి ఆర్మీ జవాన్ మృతదేహం

కారేపల్లి: కారేపల్లి మండలం సూర్యతండా గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ బానోతు అనిల్‌కుమార్ ఈనెల 11వ తేదీన కాశ్మీర్ లోయలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. ఆయన మృతదేహం మంగళవారం రాత్రి శ్రీనగర్ నుంచి హైదరాబాద్‌లోని హకీమ్‌పేట్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌కు చేరనుందని సమాచారం. అక్కడి నుంచి ఆర్మీ ఉద్యోగులు ప్రత్యేక వాహనంలో సూర్యతండాకు తీసుకొచ్చి అనిల్ భార్య బానోతు రేణుక, కుటుంబీకులకు అప్పగిస్తారు. ఆతర్వాత సైనిక లాంఛనాల నడుమ దహన సంస్కారాలు జరగనున్నాయి. కాగా, అనిల్ మృతదేహంతో వచ్చే వాహనాన్ని కారేపల్లి క్రాస్ నుంచి సూర్యతండా వరకు ఏడు కి.మీ. మేర ర్యాలీగా తీసుకొచ్చేందుకు ఆయన స్నేహితులు, బంధువులు ఏర్పాట్లు చేస్తున్నారు.

గంజాయి రవాణా కేసులో ఇద్దరికి 20 ఏళ్ల జైలుశిక్ష

ఖమ్మంలీగల్: గంజాయి తరలిస్తూ పట్టుబడిన ఇద్దరికి 20ఏళ్ల చొప్పున కఠిన కారాగార శిక్షతో పాటు రూ.2 లక్షల చొప్పున జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి కె.ఉమాదేవి మంగళవారం తీర్పు వెలువరించారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా దిండిగల్ గండిమైసమ్మ ప్రాంతానికి చెందిన నాయక్ మల్లేష్, గడ్డం భువన్ అలియాస్ ఎరుగుంట్ల రవితేజతో పాటు ఇషాక్ జల్సాలకు అలవాటు పడి అక్రమార్జన కోసం గంజాయి రవాణా చేస్తున్నారు. ఈక్రమంలోనే 2021 ఏప్రిల్ 28న కారులో రూ.30 లక్షల విలువైన 200 కేజీల గంజాయితో వస్తుండగా, ఖమ్మం సమీపాన వి.వెంకటాయపాలెం వద్ద పోలీస్ చెక్‌పోస్ట్ ఉండడంతో వేగం పెంచారు. ఈక్రమంలో ప్రయాణికులతో ఉన్న ఆటోను ఢీకొట్టగా రెండు వాహనాలు బోల్తా పడ్డాయి. ఆటోలో వెళ్తున్న ఒకరు మృతి చెందగా పోలీసులు చేరుకుని కారులో పరిశీలించడంతో 200 కేజీల గంజాయి లభించింది. ఈమేరకు మల్లేష్, భువన్ పట్టుబడగా ఇషాక్ పారిపోయాడు. వీరిపై రఘునాథపాలెం పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. విచారణ అనంతరం నిందితులపై నేరం రుజువు కావడంతో పరారీలో ఉన్న ఇషాక్ మినహా మల్లేష్, భువన్‌కు 20 ఏళ్ల చొప్పున కఠిన కారాగార శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. కేసు విచారణ గత, ప్రస్తుత ఇన్‌స్పెక్టర్లు సత్యనారాయణరెడ్డి, ఉస్మాన్ షరీఫ్ చేయగా, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఏ.శంకర్, జె.శరత్‌కుమార్‌రెడ్డి, ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది జి.రవికిషోర్, సాంబశివరావు, కె.శ్రీకాంత్, అయూబ్ సహకరించారు.

వ్యాన్‌లో తరలిస్తున్న గోవులు స్వాధీనం

తల్లాడ: తల్లాడ రింగ్ రోడ్డు సెంటర్‌లో మంగళవారం తనిఖీలు చేపట్టిన పోలీసులు అక్రమంగా గోవులను తరలిస్తున్న వ్యాన్‌ను సీజ్ చేశారు. కల్లూరు వైపు నుంచి అతి వేగంగా వస్తున్న వ్యాన్‌ను ఆపిన ట్రైనీ ఎస్సై వెంకటేష్ పరిశీలించగా అందులో ఐదు ఆవులు, నాలుగు దూడలను తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. ఈమేరకు వ్యాన్ డ్రైవర్ పళ్ల శివగణేష్, ఆవులను హైదరాబాద్‌కు తరలిస్తున్న దేవవరపు శివ, బత్తుల గోవింద్‌తో పాటు మరొకరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కలప స్వాధీనం, ఇద్దరిపై కేసు

కారేపల్లి: కలపతో అక్రమంగా ఫర్నీచర్ తయారు చేయిస్తున్న వ్యక్తితో పాటు కార్పెంటర్‌పై కారేపల్లి అటవీ అధికారులు మంగళవారం కేసు నమోదు చేశారు. కారేపల్లి మండలం మేకలతండా గ్రామానికి చెందిన ఈర్యా కలపను కార్పెంటర్ జక్కన్నకు ఇచ్చి ఫర్నీచర్ చేయిస్తున్నాడు. ఈమేరకు ఖమ్మం ఎఫ్‌డీఓ వెంకన్ననాయక్‌కు అందిన సమాచారంతో కారేపల్లి అటవీ రేంజ్ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలప దుంగలు, దూగడ మిషన్‌ను స్వాధీనం చేసుకుని ఈర్యా, జక్కన్నపై కేసు నమోదు చేసినట్లు డీఆర్‌ఓ ఆయేషా తెలిపారు.



సాక్షి క్లాసిఫైడ్స్



■ VNC సెక్యూరిటీ సర్వీసెస్ & హౌస్ కీపింగ్‌నందు సెక్యూరిటీగార్డ్సు, సెll సూపర్‌వైజర్స్, హౌస్ కీపింగ్ స్టాఫ్&వార్డ్ బాయ్స్ 18-50సంllలోపు జీ. 11-15 వేలు. ESI, PF ఖమ్మంలో 79972 41854, 94416 83688 [SCA25007200]

■ సెక్యూరిటీ గార్డ్స్ జీతం 13,000/- కోదాడ దగ్గర మేళ్ళచెరువులో కావలెను. 8 గంll డ్యూటీ, తక్కువ రేటుకు భోజనం. ✆ 79815 45383, 86884 17132 [B-866]

■ కేర్ టేకర్స్, నర్సులు కావలెను. విజయవాడలోని ప్రముఖ హోమ్‌కేర్ సర్వీస్‌లో ఇంటివద్దనే వుండి పెద్ద వారిని చూసుకొనుటకు అనుభవం గల వర్కర్స్ కావలెను. మంచి జీతం ✆ 91608 35559, 99121 15559 [B-168]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి
వివరాలకు :
ఖమ్మం : 9010299957
9705444182

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.